సరసరసాయనము

(ప్రథమభాగము.)

మం - వేంకటశర్మ గారిచే

రచితము.

శ్రీనికేతనముద్రాక్షరశాల

చన్నపట్టణాము.

1913.

వెల నాలుగు అణాలు.

పీఠిక.

ఈచిన్నిపొత్తమునకుఁ బీఠిక వ్రాయవలసినదని నామిత్రులు వేంకటశర్మగారు నన్ను నియోగించి యున్నారు. విపులముగ వ్రాయుటకు సమయము చాలమి సంక్షిప్తముగ నామనోగత విషయముల విలిఖింప శర్మగారియుఁ జదువరులయు ననుమతిఁ బ్రార్థించుచున్నాఁడను.

భారతవర్షంబునం బెల్లెడలంబలె ఆంధ్రదేశంబునను నూతనయుగమొండు ప్రారంభమయియుండుట కాలచిహ్నముల నెఱుంగఁగలవారెల్లరకును విదితము. ఈ నూతనయుగము పాశ్చాత్యనాగరికపుఁ బ్రాబల్యముచేనుద్దీపితము. లోకపరమావధి చింతనముచే నధిష్ఠితము. ప్రకృతిప్రేమా ప్రవాహముచే నార్ద్రీకృతము.

ఇట్టియుగమున నెట్టిమేటికవులయినను నుద్భవింప నెడముగలదు. నిశ్చలభక్తిమై భాషాసేవాపరులై మృదులముగ మధురముగ సుబోధకముగ వ్రాయంగల కవులాంధ్రమున నీనూతనయుగవాసు లిప్పటికే కొందఱు కానవచ్చుచున్నారు. వారిలో మామిత్రులు

శర్మగారొక్కరు ప్రథములు. వీరింబట్టే ప్రబలి వికాసమునంది కీర్తిగాంచుచుండు నిప్పటి ఒకరిద్దఱి కును ముందురానున్న ఇట్టివారలకును శర్మగారే ఈ నూతనయుగమున మార్గదర్శకులనుటకు సందియము లేదు. వీరి పద్యరచన స్వాభావికంబై హృద్యంబై పాశ్చాత్యప్రసిద్ధకవులం దలపించుచుండును. విపుల గ్రంథములకన్న హ్రస్వపద్యావళులే యొక్కొక్కటి మనస్సున కాహ్లాదమొసంగుచుండునుగాన నీగ్రంథ రత్న మెంతయు సమ్మోదావహంబై. అదియునుంగాక నియ్యది విపులగ్రంథావలోకనాశక్తిలేని బాలురం కును, బాలికలకును నుత్తమజ్ఞానప్రదాయకంబగు ననుటకు నిందలి విషయములే సాక్షులు.

ఈపద్యావళులలో ౧ర-వ పుటయందు ప్రచురిం చిన 'కోకిల' పద్యములు కవిని గొంతవఱకు చిత్రింపం గలవని నాయభిప్రాయము.

ఆంధ్రలోకంబెల్లయీయుగవికిం దగిన ప్రోత్సాహం బిడెడుగాత.

ఇట్లు,

బుధవిధేయుఁడు,

గా. హరిసర్వోత్తమరావు.

సరసరసాయనము.

(ప్రథమభాగము.)

జన్మభూమి *

మంజరీద్విపద.

చరణంబు లెచ్చోటఁ జరియించుచున్న
హృదయ మించుక యేని నెడలింపలేని
యైంద్రజాలికబంధ మది యేదొ యొకటి
మన జన్మభూమికి మనకును గలదు
సృష్టినద్ది నిరక్షరేఖయందున్న
ధ్రువ మండలంబునందున నొప్పుచున్న
మనసు నాకర్షించి మగ్నమ్ముఁ జేయు
నట్టి యయస్కాంత మందులోఁ గలదు.
అది స్వతంత్రునిచేత ననవరతంబుఁ
బ్రేమింపఁబడుచుండు హృదయంబునందు
బహుకష్టజీవియై బ్రతుకుచునుండు

---

* 'ఇలైజాకుక్' అను నామె "నాజన్మభూమి" యనుదాని యను సరణము.

బానిసచేఁ గూడ భావింపఁబడును.
భీరువుచేనైనఁ బ్రేమింపఁ బడును
మఱియు ధీరుండైన మానవుచేత
నధికానురాగత నరయంగఁబడును.
ఈవసుమతిలోన నెవ్వానినైన
నెదకిష్టమగుభూమి యేదని యడుగు
మాతండు వెంటనే యది జన్మభూమి
యని యుత్తరం బిచ్చు నతిగర్వమునను.
ఈ వసుంధరయందు నెవ్వానినైన
మహి నేప్రదేశంబు మనసార నీవు
ప్రేమింతువని ప్రశ్న వేసెదవేని
మాతృభూమినె మూడు మార్లకునేను
నెలమి దళ్కొత్తఁ బ్రేమించెదననుచు
నపుడె ప్రత్యుత్తరం బతఁడిచ్చు నీకు.
భారతదేశమా ! బహుదూరమందు
నెగడుచు భూమిలోనికిఁ జొచ్చియుండు
చక్కని పరదేశ సాగరతీర
ములకన్న నుపయోగమును జాలకున్న
నీతీరములె వర్ణనీయముల్ నాకు.

నీభూములందు వర్తితలీల నెసఁగు
పచ్చికతోఁ గాని బహురమ్యమైన
నీశరత్కాల చంద్రికలతోఁ గాని
యే మానికంబైన నీవు రాఁగలదె ?
యే మౌక్తికంబైన నీవు రాఁగలదె ?
వేని సువాసనల్ వేనికాంతులును
దమచుట్టు స్వర్గంబుఁ దనరింపఁజాలు
నట్టిపూవులతోడ నలరారునట్టి
తావులఁగూర్చి స్తోత్రములు సేయుదురు
కాని మామక జన్మకారణమైన
పుడమిపైఁ బుట్టెడు పువ్వులకన్నఁ
గాంతిమంతంబులై కనులకింపగుచు
ఘనసౌరభములచే ఘ్రాణంబుఁదనిపి
కడుఁమించు విరులను గాన జగాన.
కలకంఠ కలకంఠ కలితగానముల
శుక శారికాది మంజుల నినాదముల
మదిఁ గరంచెడి నెలమావుల నలరు
భూములకైనవచ్చు పుణ్యభూములను
క్షితిఁ జూడఁగలనె యే సీమలనైన?

అహాహా! నేత్రోత్సవం బతిశయిల్లంగ
నీ మయూర విహంగ నృత్యంబులెల్ల
ఘనఘనోదయమునఁ గానంగ నెంచి
యతిమోదమున వేచి యాప్యాయమొదవఁ
జూచి భావమునందుఁ జొక్కెడు పొలుపుఁ
బడయంగవచ్చునే పరదేశమందు?
కలరవంబులతోడఁ గల[illegible]వావళులు
గగనంబునకుఁ గౌతుకము మీర నెగసి
చిరుగజ్జియలధ్వనుల్ చెలువు రాణింప
వింత మొగ్గలు వేయు విధము నీక్షింపఁ
గర మొప్పు నంతరంగమునఁ జనించు
వేడుక కలనైన విస్మృతిఁ గనునె?
హాయిఁ గూర్చెడు సీమ లవియెన్ని గనిన
నవరత్నమయ సదనములెన్ని గనినఁ
దప్తకాంచన నికేతనములు గనిన
నానందమయ మయ్యెనా? మదీయాత్మ-
ఇంద్రభోగ మనుభవించుచు నున్న
నత్యంత సౌఖ్యంబులందుచు నున్న
నాయంత రంగంబునను జన్మభూమి

స్మరణను మఱచిపోఁ జాలితినొక్కొ ?
నా మాతృదేశమా ! నా ప్రాణ పదమ !
నా నాకలోకమా ! నా తపః ఫలమ !
నా ప్రేమధన నిధానంబులై వెలయు
వెలలేని సద్వస్తు వితతులకన్న
రహినాదు భాగ్య సర్వస్వంబు కన్న
నా ప్రాణములకన్న నామేనికన్న.
నతి గాఢముగ నిన్ను నాత్మ బ్రేమింతు.
చెలఁగి నేను విదేశ సీమల యందు
బహు సుందరోద్యాన వనములయందుఁ
దీర్ఘైన కాసార తీరమ్ములందు
స్వర్ణ నిర్మిత దివ్య సౌధమ్ములందు
చెలువు రాణించు పచ్చిక పట్టులందు
సరిలేని పూర్ణిమా చంద్రికలందు
విహరించుచున్నను వేవేగముగను
నాజన్మభూమికి నన్నుగొంపోవు.
వాయువునకు నేను స్వాగతం బిడుదు.
నాస్వదేశమ ! సదానందదాయకమ !
నాపుణ్యపుంజమా ! నామనోరథమ !

నిత్యంబు సత్యంబు నిన్నె ప్రేమింతు
నిను గౌరవించెద నిన్నె పూజింతు
నిను మది భావింతు నిన్నె సేవింతు
నేను ముమ్మాటికి నిన్నె ప్రేమింతు.
ఎలమి నీయందె నాహృదయ యంత్రంబు
నిశ్శబ్ద లీనమై నిల్చెడుంగాక!
నిర్మలంబై నట్టి నీభూమియందె
నాస్మశానంబు చెన్నారెడుంగాక!
పావన నదులచే భాగ్యదం బగుచుం
బాలు పారు నీపుణ్య భూమినే మామ
కాస్థికల్ విశ్రాంతి నందెడుంగాక!

దేశభక్తి.

క. జననియును జన్మభూమియు
ఘనమగు స్వర్గమున కన్న గౌరవ నీయల్
జనయిత్రిని జన్మస్థల
మునుభక్తి భజింపకున్న మోక్షము గలదే?

ఆ. సకలదేహములకు జనన కారణములై
తనరు శుక్లశోణితంబులకును

దనువు వృద్ధినొంది తనరారుటకు హేతు
వైన యన్న మిమున నరసి గాదె ?

తే. తల్లులకు నెల్లఁ దల్లినాఁ జెల్లు నీక
తమ్మునను దేశమాత; యీ ధర్మ మెఱిఁగి
తల్లి పిల్లలు భక్తి తాత్పర్యయుక్తి
దేశమాతను సేవింపఁ దగవలయు.

తే. ధాత్రియను పేరు తనకు సార్థకముగాఁగ
సర్వకాలంబుఁ దన యుత్సంగమునందె
మోచి ప్రాణుల నెల్లనుం బ్రోచు
జన్మభూమి భజింపని జడుఁడు జనుఁడె ?

తే. మాతయని యెడు సద్భక్తి చేతనైన
బూజ్యురాలని యనెడు సుబుద్ధినైన
సకల ఫలదాత్రియను కృతజ్ఞతనునైన
జన్మభూమిని భజియింపఁ జనును జనుండు.

మానవసేవ.

గీతము.

వస్తుజాలంబు నందెల్ల వైద్యుతాగ్ని
యిమిడియున్నట్టు సకల భూతములయందు
నీశుఁ డంతర్గతుండౌచు నెసఁగుఁగాన
నఖిలమానవసేవ సేయఁగ వలయు.
ఈశ్వరుఁడు సర్వజనుల సృజించుకతనఁ
దండ్రియగుఁగాన నరులు సోదరులుగాన
నన్నదమ్ములసేవ యర్హమ్ముగాన
నఖిల మానవసేవ సేయఁగవలయు.
మానవులసేవయే దేశమాతృ సేవ
దేశసేవయె సకల లోకేశసేవ
కావునను దేశభక్తులు దైవభక్తు
లఖిల మానవసేవ సేయఁగవలయు.
మనుజులన్యోన్య సాహాయ్యమున్న వృద్ధి
నందుటయె యీశ్వరునకుఁ బ్రియంబుగాన
దైవ శాసనమును దీర్పఁదలఁతు మేని
యఖిల మానవసేవ సేయఁగవలయు.
ప్రజలసేవయె తనసేవవలెఁ దలంచి

యీశ్వరుఁడు చాలఁదృప్తి వహించుఁగాన
నీశ్వరునిసేవసేయ వాంఛించు మర్త్యు
లఖిలమానవసేవ సేయంగవలయు.

ప్రజల శుశ్రూషకై శరీరము నిరంత
రమును వినియోగపఱచు స్వార్థరహితుండ
ధన్యతముఁ డగుఁగాన నుత్తమ జనంబు
లఖిల మానవసేవ సేయంగవలయు.

పామరులయందు గొప్పవిద్వాంసులందు
ధనికులందును నిరుపేద మనుజులందు
నార్త జనులందు సమబుద్ధి నలరఁజేసి
యఖిల మానవసేవ సేయంగవలయు.

సత్రములపాఠశాలలస్థాపనంబొ
ఔషధాలయనిర్మాణపోషణములొ
శక్తికిందగునుపయుక్తసరణిఁదీర్చి
నఖిల మానవసేవ సేయంగవలయు.

ఆర్తజనులకు శరణాల యమ్ములు నిల్పి
రోగులకు నౌషధము లిచ్చి బాగుచేసి
వృత్తిలేనట్టి జనులకు వృత్తిఁగూర్చి
యఖిల మానవసేవ సేయంగవలయు.

“ ఆత్మవత్సర్వ భూతాని ” యనెడు సూక్తి
మఱవకెల్లరఁ దనభంగి నరసికొనుచు
జీవయాత్రను జేయుచుఁ బావనగతి
నఖిల మానవసేవ సేయంగవలయు.

ధరఁ “ బరోపకారార్థ మిదంశరీర ”
మనెడు నార్యోక్తిఁ దలచి, సమస్తగతులఁ
బరుల కుపకారకములైన పనులొనర్చి
యఖిల మానవసేవ సేయంగవలయు.

నెమ్మిఁ “ బాపాయ పరపీడన ” మ్మటంచు
నమ్మి తనవల్ల సుంతైన నరులకెపుడు
బాధఁగలుగంగ నీయక సాధురీతి
నఖిల మానవసేవ సేయంగవలయు.

మనుజసేవయె యీశ సేవనముగాన
నీవు సేవించి ప్రతిఫలం బాశపడఁగ
రాదు గావున నిష్కామ రమ్య భక్తి
నఖిల మానవసేవ సేయంగవలయు.

మనకు విధియించినట్టి ధర్మంబు నందె
కలదు మానవసేవయుఁ గాన విధిగ
మన స్వధర్మం బనుష్ఠించు మార్గమునను
నైన మానవసేవ సేయంగవలయు.

కవి : కాంచనము.

కవి:—

సీ|| సరసతను మించి యతి మనోహరతఁ గాంచి
సర్వసుమన సామోదత సంతరించి
సుకవివర్ణన కెక్కిన సుకృతి వీవు
కలకనొందేల ? చంపక కలిక ! చెప్పుము !

సీ|| కర్ణయుగమందు శిరమందుఁ గంఠమందుఁ
గరకమలమందు సుశయనోత్కరములందుఁ
గరము ననురక్తిఁ బ్రజలెల్ల గౌరవించు
నీదు మహిమాతిశయము వర్ణింపఁదరమె ?

సీ|| రాజరాజ శిరస్థ చిరత్నరత్న
రాజిత కిరీటమున, రాజరాజసేవ్య
రాజమాళి సుమాళిసరస, నటించు
నీదు పూజ్యత గణుతింపఁగాఁ దరంబె ?

కాంచనము:—

ఆ|| సదయ హృదయ ! నాదుసంతాప హేతువు
విశదముగను విన్నవింతు వినుము
వివిధ పుష్పరతుల విహరించు రసికుండు
మధు కరుండు నన్ను మఱచినాఁడు.

గీ॥ ఉదుటుగలచేవఁ దొలువంగ నులినిమించు
పదనుగల మోము మిక్కిలి మృదువులయిన
పుష్పములమీఁదఁ గోమలస్ఫూర్తిఁ జేయు
వానినేరుపుఁ గొనియాడ నౌనె ? మనకు.
గీ॥ వినెదు వారల వీనుల విందొనర్చి
చేతముఁ గరంచు సరస సంగీతకలనఁ
గుసుమ జాతులనెల్లఁ గైవసమొనర్చి
యెపుడు రమియించు తద్భాగ్య మెన్న వశమె ?
గీ॥ పాటలను బాడి మెప్పించి పద్మినులను
వారు ప్రియ పూర్వముగ నిచ్చు పూరసమున
జీవ యాత్రను హాయిగాఁ జేయుఁగాని
యొరులఁ బీడింపఁడూరకే యుదరమునకు.
గీ॥ అతని చెలిమి లభింపక సతత మిట్లు
చిత్త సంతృప్తిలేకనేఁ జింతి లెదను
సొగసులెన్నున్న మనసున సుఖములేమి
కానఁ గాచిన వెన్నెల గాదె ? బ్రదుకు.
కవి:—
గీ॥ చాల బేలవుసుమి। నీవు చంపకంబ !
నీదు ప్రఖ్యాతి యేమి ? నీనీతి యేమి ?

పూత చారిత్రమేమి ? నీజాతియేమి ?
క్రూరపు మచ్చాపు పట్టుమఁ గోపశేమి ?

గీ॥ అధిక చంచలుండు మధుపాన మత్తుండు
మలిన మూర్తి బహుళ మార్గవర్తి
ఇట్టి వానివలచి యిస్సిరో ! నీకీర్తి
నలుపుఁజేసి కొనఁగఁ దలఁచెదేల ?

గీ॥ అదయతను దాల్చి యుచితంబు ననుచితంబుఁ
బుణ్యమును బాపమును నెంచఁబోక విరహి
జనుల నేచెడు మరునికి సాయపడెదు
చెనఁటి చండాలులనుగోరఁ జనునె ? యకట ?

గీ॥ పద్మినిని బాయనని మున్ను బాసచేసి
పగలు రమియించు రేయినిఁ దొగలఁజేరి
యెప్పుడు విడనాడనంచు నమ్మించి మరల
దానిఁ గూడు భుజంగ వర్తనుఁడతండు.

గీ॥ తుమ్మెద యటంచు నవశకు నమ్ముగాఁగఁ
జెవులు చిల్లులువడ రొదఁజేయు చెవుడు
మనసు విసిగించు నిటువంటి మడ్డివాని
నేమనుచు వరియించితి ? నీవు చెప్పుము !

గీ॥ తల్లి నెడఁ బాపి బిడ్డలఁ దస్కరించి
తెచ్చి బలుమంత్ర తంత్ర యుక్తిని భ్రమింపఁ
జేసి తనజాతిగా మార్చు దోసకాడు
ధూర్తు మటు మాయకాఁడు మధువ్రతుండు.

గీ॥ తుచ్ఛమగు వాని సంగతిఁ ద్రోసి పుచ్చి
శాశ్వతా నంద వరుఁడైన శంకరుని ప
దార్చనం బబ్బుటయె ధన్యమనుచుఁ దెలిసి
కొనుమ! భజియించిమనుమ! కాంచనము! వినుమ!

కోకిల.

క॥ ఏకాకి వీ వనంబునఁ
గోకిలమా! కొసరి కొసరి కూసెదవు సుమీ!
నీ కలకంఠము నోర్వని
కాకులు కడు నిర్దయములు కలహప్రియముల్.

ఆ. ఎన్ని దినము లిట్టు లేకాకి మూకలో
మునులరీతి మౌనమును వహించి
ముద మొకింత లేక బ్రదుకుదు విస్సిరో!
యనుచు రోయఁబోకు మా! పికంబ!

గీ॥ కన్నతల్లియె నీయందుఁ గరుణ మాలి
పుట్టి నప్పుడె పొరుగింటఁ బెట్టి పోయె
కొన్ని నాళ్లకె నినుఁబెంచుకొన్న తల్లి
యిల్లు వెడలించె. దురదృష్టమేమొ? పికమ!

ఆ॥ కాకు లెల్ల నీకు గర్భశత్రువులౌట
కెన్న నీ స్వరంబె హేతువు కద!
గుణమె దుర్గుణంబగును గాదె? కాల వి
పర్యయంబునందుఁ బరభృతంబ!

ఆ॥ కాకి యెగ్గులేమి కావించె? బ్రహ్మకు
నీవు లగ్గులేమి నెరపినావు?
దాని కంఠ మట్లు దగ్ధంబుఁ జేసి నీ
కెట్లు శ్రావ్య కంఠ మిచ్చె? పికమ!

క॥ రూపు లొకటి చేసిన వా
ణీపతి వేఱుగ సృజించునే? స్వరములు త
త్పాప మటు బ్రద్దలయ్యెను;
నీపుణ్యం బిట్లు పండె; నిక్కము పికమా!

క॥ గాత్రము లొక రీతినె శ్రీ
పుత్రుఁడు నిర్మించి నీదు పుణ్యఫలమునన్

గాత్రములు వేఱు పఱచెను
చిత్రముకద! సృష్టి కర్తచెయ్వులు పికమా!

గీ॥ చివురులను గూర్చి ప్రీతిఁ బోషించి నట్టి
స్వామి యరిగిన యవల హర్షంబుఁ దక్క
వగపునను ప్రుక్కి యెలుగెత్తి పలుక వహహా!
నిజము విశ్వాస మన్నను నీదె! పికమ!

గీ॥ పదుగురికి నింపు పుట్టఁగాఁ బలుకనేర్తు;
మోడులును జగురింపఁగాఁ బాడ నేర్తు;
పులుగు లందెల్ల మేటివై చెలఁగు దార!
పక్షివైన నీజన్మంబు పావనంబు.

గీ॥ పల్లవంబులనే కాని భక్షణంబు
సలుపనొల్లవు; మాధవస్వామిఁగాని
పాడనొల్లవు; ఆత్మ భూప్రభునిఁగాని
కొలువనొల్లవు, సుకృతివే, కోకిలంబ.

గీ॥ నిరతము వనంబులనె కాని నిలువఁ బోవు;
ఎల్లఘనతరులను నాశ్రయింపఁ బోవు;
తివిరి సన్మార్గమును దప్పి తిరుగఁ బోవు;
నీదు సద్వర్తనము మేలు కాదె? పికమ;

గీ॥ మేటి ద్విజకుల మందు జన్మించినావు;
పరమహంసల స్నేహంబుఁ బడసి నావు;
శుక సుసంగతి నిత్యంబుఁ జూచినావు;
మేలు ; కోయిల ; నీజన్మమే తరించె.

ఆ॥ చిలుక చక్కఁదనిని పలుకుఁ జెప్పినరీతి
కోకిలంబ ! చివురుఁటాకు మెసవి
రహినిఁబంచ మస్వరమునఁ బాడెద వీవు ;
తిండికారణంబె ? తెలివికాక.

గీ॥ మునుపు కొన్నాళ్లు పలుగాకి మూఁకఁ జేరి
బ్రతికితి నటంచు వగచెదు కతన నేమొ ?
కోవెలా! కన్నులారీతిఁ జేవురించె;
మానధనుఁడోర్చునే ? యవమానలవము.

గీ॥ ఎంతకాలంబు నీచులయింట నున్న
నకట ! పరపుష్టమన్న పేరొకటిఁదక్క
నవగుణం బబ్బలేదిది యబ్బురంబు
నీసుశీలత శ్లాఘ్యంబు నీడజంబ!

గీ॥ కాకులకు నీకు నాకార మేకమగుట
లోకు లెఱుగంగలే రనుకొకు సుమ్మ!

కంఠమాధుర్యమే శతగతులఁ దెచ్చు
సారతర కీర్తిఁ గలకంఠ శాబకంబ!

ధారాధరము.

ఆ॥ నింగిపై సదా మెలంగెడు నీకును
నేలపై నటించు నెమలులకును
నేస్తమేమొ? నీదు నేర్పేమొ? నినుజూచి
గేరి యాడు నెమ్మి వారిధరమ!

ఆ॥ తనువు లెంత దూరమున వర్తిలుచున్న
మనసు లొక్కచోట మసలు నేని?
స్నేహధర్మ మెపుడుఁ జెడదన్న నీతికి
మీదు చెలిమి సాక్షి కాదె? జలద!

గీ॥ అప్పు లిడ జాలు రత్నాకరాదు లుండ
విడచి సారంగములు నిన్ను వేఁడు చుంట
నీమహోన్నతిఁ దిలకించి నీదు ఘనతఁ
గాంచి సరసత్వమును జూచికాదె? జలద!

ఆ॥ అహహ! నీదు స్నేహ మహిమాతిశయమే మొ
చాతకంబు నీవొసంగునట్టి

జలకణంబులాని సంతుష్టింగని నిన్ను
నిరత మాశ్రయించు నీరధరము !

ఆ॥ అమృతమో? విషంబొ? యదినేనెఱుంగంగాని
నీవొసంగు రసముఁ ద్రావు వెనుక ;
నితర వస్తువేది యిందక చాతకం
బుపవసించు నిరతమోపయోద !

ఆ॥ సరస గుణముఁగలిగి సతతాశ్రిత కదంబ
కావనుండ వగుచుఁ బావనుండ
వైన నీదుఘనత నభినుతింప వశంబ
గునె? పయోద ! దానగుణ వినోద !

తే॥ ఇంద్రునకు వాహనంబవై యొసఁగినావు
చంద్రసూర్యుల నెదిరింపఁ జాలినావు
మిన్ను ముట్టిన యున్నతి మెరసినావు
నీవు సామాన్యుఁడవు కావు! నీరదంబ !

ఆ॥ లక్ష్మితోడ మెఱసి లలిమీాఱు హరిఁబోలె
మెఱుముతోడఁగూడి మెఱయు నీదు
సొంపు పెంపు నింపుఁ జూచి సంతోషింప
వలెను గాని చెప్పవశమె ! శరద

ఆ॥ విశ్వమునకు నెల్ల వెలుఁగును దయసేసి
సుఖముఁ గలుగఁజేయు సూర్యునకును
వెలుఁగుఁ గూర్తువంట ! వింతయా నీశక్తి
వశమె ! ప్రస్తుతింప వారి వాహ !

తే॥ నీదయావృష్టిచేత నే కాదె ! భూమి
సర్వ సస్యాఢ్యమై యొప్పి సకలభూత
జీవనాధారమగుచు మోదావహంబు
నగుచు వర్ధిల్లు వారి వాహావతంస !

తే. భీష్మమైనట్టి గ్రీష్మకాలోష్మమునను
సోలి తూలెడు నీజంతు జాలమునకుఁ
జల్లఁదనమును సౌఖ్యంబు సంతసంబుఁ
గూర్చు పుణ్యాత్ములెవరు ? నీకొలఁది జలద !

తే॥ ఏఱులై పాఱె నీదాన ధారలెల్లఁ
జూడఁ జూడంగ నీయిల్లు శూన్యమయ్యె;
నొడలు గుల్లయ్యె! నప్పుల బడలనయ్యె!
లేదనెడు మాట నీయొద్ద లేదు జలద !

ఆ॥ నీదు గర్జ గర్భ నిర్భేదమును జేయు
వ్రాలఁజేయు గుండె వ్రీలఁజేయు

ఘనతరంబు నీదు గాంభీర్యము కరంబు
ఘనుఁడ వగుదు వీవు గగనసదన !

ఆ॥ సర్వకార్యములకు సాధనకారివై
యఖిల దిశల బ్రహ్మ మట్లునిండి
భృత్యులట్లు యుపచరించును జనులకా
మించు నీవలన జనించు జలద !

ఆ॥ తివిరి యప్పులెన్ని తెచ్చినఁ ద్వైరగనీ
విచ్చుకతనఁ గాదె ! మెచ్చి మరల
రవిఁ నొసఁగు చంద్రు రత్నాకరాదులు
పరపతి యననదె ! వరపయోద !

క॥ మానుగఁ బరోప కృతికై
మేనెత్తం బోలు ! మేలు ! మేలు ! బళీ ! నీ
దే నిజము, ధన్య జన్మము
దాన గుణాధారమా ! సుధాధారమా !

తే॥ కవచకుండలా లిచ్చిన కర్ణు కన్న
వెన్నెముకనిచ్చిన దధీచికన్న మేని
కండలిచ్చిన యాశిబికన్న నీవె
ఘనుఁడవనియేమొ ? ఘనుఁడంద్రునినుఁబయోద.

క॥ నీవుపకారము సేయం
బోవఁగఁ జెలుచుఁ బ్రభంజనుఁడు దాతకడన్
గావలులుచేరి యిచ్చెడు
నీవులఁ జెలుచుటగి నైజమేకద ! జలదా !

ఆ॥ ఎండ నడచువానికే చెట్టుఁ జేమయు
లేని చోట నీవు భాను నకును
నడ్డమగుచుఁ గాచి యాదరింపకయున్న
నొండు దిక్కుఁగలదె ? యోపయోద !

క॥ కౌతుకమున షడ్జస్వర
గీతములను బాడి యాడికీర్తించెదు కే
కీతతులఁ జూచి పొంగెదు
నాతతమగు భాగ్యమెవరి కబ్బు ? పయోదా !

క॥ మృగములవలె ఖగములవలె
నగములవలెఁ జిత్రగతుల నానాగతులన్
గగనమను నాటతెరపై
నగపడి జగములరఁజేతు వహాహాపయోదా !

తే॥ పెద్దరూపంబు తోడఁ గన్పించి చూచు
చుండ నణురూపమగుదు వఖండమైన

యట్టి బ్రహ్మాండ మెల్ల నాయట్లణుస్వ
రూపముల రాశియని తెల్పురూపొ ? జలద !

క॥ ఒక మారు ధవళిమయు వే
ఱొక మారా రుణ్యమును మఱొకపర్యాయం
బిఁక నొక వర్ణముఁ దాల్తువు
సకలజ్ఞుండైన యైంద్ర జాలికుఁ బోలెన్.

ఖద్యోతము.

ఆ॥ మినుకు మినుకు మనుచు మెఱయు నాతెక్కలు
కీటకములలోన మేఁటి ననుచు
గర్వపడెద వేల ? ఖద్యోతమా ! నీదు
మెఱపదెంత ? నీదు మేలిమెంత ?

గీ॥ ఉర్వీజనులెల్ల నిన్ను ఖద్యోతమనుచుఁ
బిలుతురని విఱ్ఱవీగకు ! వెఱ్ఱిపురువ !
భువన హితకారియై జగత్పూజ్యుఁడైన
తరణి యతఁడేడ ? నీవేడ ? తలఁచికొనుము ?

గీ॥ పేరు లోకమైన మాత్రాన గౌరవంబు
కలుగునే ? నీచులకు నధికులకుఁ బోలె

అమృతమను పేరు విషమున కమరియున్న
దాని గౌరవమున్నదే? దీని కేందు?

గీ॥ ఇలను సామాన్య కీటకములకు లేని
ఱెక్కలున్నవి గాననే నెక్కువనుచు
మిన్ను మన్నునుఁగానక మిడిసి పడకు!
మెఱసినను ఱెక్కలున్నను బురుగు వనరె!

గీ॥ ద్యుమణితోఁ నీవు సుంత ఖద్యోత సామ్య
మందఁ గలిగినఁ దత్కీర్తి నందఁ గలవె!
తొండమును గల్గియుండిన దోమకూన
సామజము కాఁగలదె? యెన్ని చందములను.

క॥ మణివలె మెఱయుటను నభో
మణివలెనే నన్నుఁ గీటమని యంద్రు సుధీ
మణులనుచు మురియకే మీ
కణు మాత్రము సామ్యమున్నదటె కీటకమా!

క॥ ఱెక్కలు గలవు గదా! యని
ఱెక్కలతోఁ గలిసి మెలసి ఱెక్కల త్రోవన్
జక్కఁగ మెఱసెద ననుచున్
మిక్కిలిగా మిడిసి పడకు! మిణుఁగురుఁబురుగా!

సీ॥ మిణుఁగురులఁ బోలె నించుక మెఱయుదనుచు
నందఱు మిణుంగురుం బురు వంద్రుగాని
తత్ప్రకాశత, తత్పవిత్రత, తదుష్ణ
తయుఁ, దదుపయోగమును రవంతయునుగలవె?

సీ॥ గబ్బిలము రెక్కలును బాష్లఁ గలుగు కతన
ఖగముల మృగంబులను గూడఁ గలయనట్లు
పురుగువును బుల్గువును గాక పోయితీవు
పక్షములతోడ సీకైన ఫలిత మిదియె.

సీ॥ నింగిపై నెక్కఁగడైమైన నిలువఁ గలవో?
విడువ కొక్కక్షణంబైన వెలుఁగఁ గలవో?
రేలు ప్రజలకుఁ బ్రొద్దేర్పరింపఁ గలవొ?
సాటి యెటు వత్తు వీవు నక్షత్రములకు.

సీ॥ చుక్కలను విస్ఫులింగాలఁ జూపి నిన్నుఁ
జూప దివిటీల క్రిందను దీపమనరె?
ఇంత మాత్ర మునకె యేలవ్యైగసి పడుచు
నుబ్బి తబ్బిబ్బు పడెదె? ఖద్యోత నామ!

సీ॥ నీవు నక్షత్రములఁ బోలె నిశ్చయముగ
మెఱయకున్నఁ జంచలయగు మెఱుపువోలెఁ

గనులు మిఱుమిట్లు గొనునట్లు కాంతిఁజూపి
చేత మలరింపఁగలవె? ఖద్యోత నామ!

క॥ చుక్కలు మించును నిన్నా
చుక్కలఁ జంద్రుండు మించు సూర్యుండతనిన్
మిక్కిలి మించును తేజున
నిక్కము! ఖద్యోత! ఘనుఁడనేనని యెపుడున్.

---

* బంగారు పిచ్చుక.

తే॥ చటకరాజమ! నీమేని చాయఁ జూచి
నరులు బంగారు పిచ్చుకన్నారటంచు
నేను తలఁపను జుమ్మి! నీ నేస్తుఁ జూచి
తగిన పేరనుకొని రంచుఁ దలఁతు నెపుడు.

తే॥ జననమైతివి పిచ్చుక జాతిలోన
వర్తిలుచు నుంటి వాజాతివారిఁ గలసి
యూర పిచ్చుక నీకాలిగోరునైన
బోలఁజాలునె! యెన్ని జన్మాలకైన.

---

* ఈ పద్యము లొక బంగారు పిచ్చుకచేఁ జేయఁబడిన వినోదముల కానందించి వ్రాయఁబడినవి.

తే॥ గ్రామములయందుఁ బిచ్చుకల్ కాపురంబు
సేయుచెఱిఁగియు వానికి స్వేచ్ఛ లేమిఁ
దలఁచి యది రోసి సర్వస్వతంత్రబుద్ధిఁ
బాలసఖుల వసింతు విడిసేలు! పులుఁగుఱేఁడ !

ఆ॥ నీదు సూక్ష్మబుద్ధి నీ చమత్కారంబుఁ
గన్న నిన్ను మానికంపు బిచ్చు
కన్నఁజాల దన్న నెన్నన్న ! బంగారు
పిచ్చుకన్న నేమి వింత ? చెప్పుము !

తే॥ మనుజులే దిక్కు వానలో మాకు ననెడు
కోర్కెమెయి నీవు కట్టెడు గూండ్లుచూచి
తొలుకరికి ముందె తెలిసికోఁ గలిగి మిగుల
సంతసింతురు నిను మెచ్చి చటకరాజ !

తే॥ మానవులలోన బహు బుద్ధిమంతులైన
నల్లఁగాలేని మాదిరి నబ్బురముగ
గూండ్లు నిర్మించు నీనేర్పుకొలఁదిఁ దెలియ
నమరశిల్పికి సందేహ మని తలంతు.

తే॥ త్రాటిమేశలుఁ దడప లీతాకుఁజీలి
కలును జిరుగడ్డిపరకలుఁ గలయఁ గూర్చి

జిగిబిగి చెలంగ నీవల్లు సొగసుఁగులుకు
గూటి పోడిమి చాటు నీ మేటి తనము.

తే॥ మేలి గృహములు మేడలు మిద్దెటిండ్లు
గాలి వానల కెప్పుడైనఁ గూలుఁ గాని
నేల కెత్తుగఁ జెట్లపైఁ గ్రాలు నీదు
గూటికే భంగపాటు రాదేటి వింతొ?

తే॥ ఆఱుమూడు నెలల కొక్కమారు తిరుగ
వైచుచున్నను మా యిండ్లు వానఁ గురియు
గాని నీ యిల్లు సవరించి కట్టుకున్న
నీటి బొట్టైనఁ జొరదార! నీడ జంబ!

ఆ॥ నీదు బిడ్డలూఁగ నెఱి నుయ్యెలయుఁ బోలెఁ
గ్రీడలాడ మంచిమేడఁ బోలెఁ
గాపురంబు సేయఁగా మందిరముఁ బోలె
నలరు నీకులాయ మండజంబ!

తే॥ ఇరులఁ గడఁతేర్చి చాల వెల్తురులఁ జేర్చి
సుఖము నొడఁగూర్చు రత్నదీపికలు గాఁగ
గూట మిణుఁగురుఁ బురుగులఁ గూర్చు నీదు
బుద్ధికుశలతఁ దలఁతు మెప్పులుఁగు మిన్న!

క॥ నినుఁ బెంచు వార లేవిరు
లను జూపినఁ జిటుక లోపలనె తెచ్చి ముదం
బొనఁ గూర్చెద వేలిక కిఁకఁ
గొని యాడఁగఁదరమె! నీ సుగుణ గరిమ మహో!

ఆ॥ బంతిఁ నీకుఁజూపి బావిలోఁ బడవేయఁ
దోనఁ బోయి దాన్నిఁ దోడి తెచ్చి
పోషకునకు మోదమును గూర్చు నీకూర్మి
పేర్మిఁ బొగడఁ దరమె! విహఁగ తిలక!

ఆ॥ విరు లొసంగి పంప వేవేగమునఁ బోయి
సరసురాలి కీలు జడను ముడిచి
వచ్చి దానిపతికిఁ బ్రమదంబుఁ గూర్చు నీ
జాణతనము నెన్నఁ జాల ఖగమ!

క॥ చాతుర్యముఁ గల శిల్పి వి
జ్యోతిష్కుఁడ వద్భుతైంద్ర జాలికుఁడవు, సు
స్వాతంత్ర్య రతుఁడ వహహో!
యే తెఱఁగున నిన్నుఁ బోలు నితర ఖగంబుల్.

ఆ॥ చిన్నపిట్ట యింత విన్నాణఁపుం బనుల్
సేసె మనుజు లెంత లేసి పనులు

నెరపవచ్చు ననెడు నీతినిఁ దెలుప దే
వుఁడు నిన్నుఁ సృజింపఁ బోలు! ఖగమ!

తేన టీగ.

గీ॥ నిదుర లేచిన దాదిగా నీవు మరల
నిదుర నొందెడు నందాక నిమిషమైన
విశ్రమింపక యాహార వితతి వెదకి
యార్జనము సేయు నోపిక నభినుతింతు.

గీ॥ అను దినముఁ బొట్ట నిండిన యంతతోనె
తృప్తినొందక తేనె నెంతేనిఁ గూర్చి
వానకారున శ్రమ రవంతైన లేక
సుఖము నొందెడు నిన్ను సంస్తుతి యొనర్తు.

గీ॥ ప్రాలుమాలి యొడల్వంచి పాటు పడక
యుదర పోషణకాహార మొదవదనుచు
శోకమొంది కృశించెడు సోమరులకు
నీదు గుణపాఠమే పఠనీయము గద!

క॥ కల వస్తువు లన్నియు వి
చ్చలవిడి వెచ్చించి ముప్పు సమయంబుఁ ద్రి

ప్పాలఁబడెడు పామరులు నీ
వలన బ్రదుకు దెరవు దెలియవలెగద! సరఘా!

ఆ॥ అమృత సమములైన యలజుంటి తేనియ
పుట్ట తేనె చిన్ని పువ్వు తేనె
మొదలుగలవి ప్రజలకొదవు భాగ్యము నీవు
లేనినాఁడు గలదె? తేనెటీగ!

క॥ నీ పట్టుల వలననె కా
దా! పుట్టును మైన మది సదా మనుజులకుఁ
జేపట్ట నుపకరించును
నీ పుట్టువు సార్థకంబు నిక్కము సరఘా!

చూతము.

గీతము.

చూత మని దాయవచ్చిన చూపరులను
జేత మలరించి మిగుల నచ్చెరువు నించి
సారెకును జూత మనిపించు సౌరుమించి
నందుచేతనొ చూతమా! యఖిల జనులుఁ
జూత మని పిల్తు రిది మాకుఁ జోద్యమయ్యె.
కోమల శ్యామలంబులై కొమరు మిగిలి

కలిత తరుణారుణంబైన కాంతి గలిగి
లలిత గతినొప్పు పల్లవంబులఁ జెలంగి
సొగసై బాగులైన యశోకపత్ర
శోభ మఱపించు దళముల సొంపు మెఱసి.
సరస సౌరభ సుమరస సహితమగుచు
ఘన మధువ్రత సంగీత కలన నడరి
హృదయ మలరించు పూతచే నింపుమీఱి
చూడఁ దగిన శలాటువుల్ సురుచిరంపు
ఫలములును వ్రేలు నీగోము భవ్యతరము.
మనసు నలరించు శృంగార వనములందు
మేటి తరుజాతి గల మంచి తోటలందు
నీవు లేకున్న మోదంబు నిండఁబోదు.
జాను మీరెడు ఫలవృక్ష జాతియందు
నీవె నాయక మణి గాగ నెగడు చుందు.
నవురుఁగులికెడు నీదు లేఁజివురుఁదనివి
ననక కుత్తుక బంటిగాఁ దినక యున్నఁ
గరము నెలుఁగెత్తి పంచమ స్వరముతోడ
హాయి మీఱఁగఁ గిన్నెరల్ మ్రోయు నట్లు
కోయిల కొలంబు గానంబు సేయఁ గలదె?

పండుగులలోన మిన్నయై పరగుచుండి
వేడుకలు గూర్చు నేడాది నాఁడు నరులు
నింబకుసు మాదికముతోడ నీశలాటు
సంతతినిఁ గూడఁజేరిచి సంతసమున
మెలసి భక్షింతు రా రోగ్యకరమటంచు
నే శుభంబెవ్వ రెక్కడ నెపుడు చేయఁ
దలఁచు కొన్నను నీదు పత్రములు లేక
బుధులు ప్రారంభమును జేయఁబోరు. సతులు
వ్రతము లొనరించు నెడ నీదు పత్రములనె
తోరముగఁ గూర్చి తాల్తురు తోరముగను
మంత్రము లవెన్నియున్నను మహిమ గలుగు
నీ దళంబుల సంగతి నాదు కొనక
జీవనములు పావనములు కావటంచు
ద్విజులు పుణ్యాహవాచన వేళలందు
ని న్నపేక్షించు చుండుట నిక్కము కద!
కుముద, కల్హార, కమలాది కుసుమజాతు
లెన్నియున్నను బచ్చనై పన్నెఁద నరు
నీదు చిరుకొమ్మలుండక రాదు శోభ
చారు శృంగార వరగృహ ద్వారములను

ప్రేలు తోరణములకు రసాల రాజ !
అడరు బీరెండ లోపల నడచి నడచి
బడలి వడదాకి కడు సోలి వాలి తూలి
నిన్నుఁ గన్నంతనె ముదమ్ము నిండు కొనఁగ
నాసమొయి నీదు సన్నిధి కరుగు దెంచి
విశ్రమించెదు పాంథుల కశ్రమమునఁ
జిరుత వాయువులను దెచ్చి చెమటలార్చి
చల్లఁ దనమిచ్చి సుఖమిచ్చి సత్వమిచ్చి
కౌతుకము నిచ్చి బుద్ధి వికాసమిచ్చి
యతిథి కభ్యాగతికి మరియాద వెలయ
నాదరముఁ జూపు మంచి గృహస్థుఁ బోలెఁ
జెలిమి తళుకొత్త నుపచరించెదవు గాదె ?
అహాహా ! నీసహకారత సార్థకంబు !
నిన్ను జేరంగ వచ్చెడు పిన్నలకును
బెద్దలకుఁ గూడఁ దద్దయుఁ బ్రీతితోడఁ
గనకకాంతుల్లు వెదఁజల్లఁగలిగి మిగులఁ
బచ్చనై ఘుమ ఘుమ మని పరిమళించు
మధుర ఫలముల నొసఁగుచు మదికి ముదము
గొల్పుదువు గాదె నీదగు పొల్పునెల్లఁ

జూచియే కాదె నిత్యంబు శుకములెల్ల
నీ ఫలంబులు బొజ్జలునిండ మెక్కి
కలికి కలకండ పలుకులఁ గప్పు రంపుఁ
బలుకులనుజిల్కు పలుకులు పలుకుచుండి
చెవులకును నిండు పండువుఁజేయు చుండు.
నీ వనేకాకృతులు గల్గి నిరుపమాన
రుచులచే నొప్పు గులుకుదు ఋచిర కీర్తిఁ
దాల్చి తరు జాతిలోఁ జాలఁదనరుచుందు
బంభరంబులు కొన్ని నీ పండ్లయందు
గర్భములలోనఁ బుట్టి చక్కఁగను వృద్ధి
జెందుచుండుటఁ గంటి మీ చిత్ర మేమొ
నీకె తెలియంగవలె నిది నిక్కువంబు.
నీవు పుట్టినదాదిగా నీడ నిచ్చి
జంతు కోటికి సౌఖ్యంబు సంతరించి
నట్టి నీ పుణ్యము ఫలించెనా యనంగ
నిలువునను బండియున్న నీచ్ఛేలావు దనరు
చివురులును నాకులును శలాటువులుఁ బండ్లుఁ
గొనకు బ్రమానును గూడ లోకులకు నిచ్చు
ప్రతి ఫలాపేక్ష లేని నీ వితరణంబు

సకల జనులకు మార్గదర్శకము గాదె ?
భూజ రాజమ! ఏదేశమునకు లేని
భాగ్యమును సోయగమును మాభరత ఖండ
మునకుఁ గూరిచి నీజన్మమున నఖండ
భోగ మానందమును గూర్చి పొల్తుకాదె ?
లలిత మా కందమా ! నీవిలాస లక్ష్మి
సుకవి జనవర్ణ నీయంబు సుందరంబు
ధరణి జనులకు నెల్ల నీ దర్శనంబు
నేత్ర పర్వంబు, హర్ష సందీపకంబు,
పావన కరంబుఁ బరమ శుభావహంబు
నీ మహాత్వంబు విబుధైక నిగదితంబు
దశ దిశలయందు నీచారు ధవళ కీర్తి
తనరుఁ గావుత మా చంద్ర తారకముగ !

ఇం దిం దిర ము.

క॥ సిరితోఁ గలసి మెలసి యన
వరతము విహరింతు వనజవన వీథులయం
దిరవుగ నెలకొని యుందిం
దిర మనఁగా నెగడుదును సుషీతతివృగడన్.

గీ॥ సానపట్టక నిగనిగరాని యింద్రో
నీల మాణిక్య శకలాల లీల డీలు
పఱుపఁగాఁ జాలు డాలునఁబరగు గరుల
నలరుటను గాదె? నను భృంగమంద్రు బుధులు.

క॥ పరులన్న సేవగించెదు
వర పద్మను లే ప్రసన్న భావమునన్ న
న్నరయుదురు మధురసంబుల
నరమర లేకిచ్చుచుందు రాతిథ్యముగన్.

గీ॥ స్నిగ్ధశీతల సౌగభ ముగ్ధుఁడగుచు
గంధ వహుఁడల్లనను వీవ బంధురముగఁ
దమ్మి మిద్దెల నివసించి సమ్మదమున
గానమును బాడి యానంద కందమగుదు.

క॥ నిలయంబు జలజ విపినము,
మెలఁగుట శ్రీ దేవితోడ, మేలాహారం
బలరుల తేనియ, విద్దియ
కలగానంబిట్టి భాగ్య గరిమయుఁ గలదే ?

గీ॥ ఉలివలెను చేవఁ దొలిచెడ
నలరులు కసి గందకుండ నానెదఁ దేనెల్
చెలఁగుచుఁ గఠినతయును బే
శలతయుఁ బచరించుచుందు సహజ చతురతన్.

గీ॥ తీయనగు విల్లు, మృదుపుష్పసాయకములు
దనరు సుకుమారుఁడైన మారునకు నారి
నగుచు సహకారినై విజయంబుఁగూర్తు
ద్రి జగముల నీడులేని సత్కీర్తిఁ దెత్తు.

క॥ నరులకు సురలకును నలం
కరణార్హంబగుచు గరిమఁగనియెడు నలక్రొ
వ్విరుల కలంకారమునై
కరమలరుదు నళియనంగఖ్యాతి వహింతున్.

క॥ సరసీరుహనేత్రల కచ
భరరుచి, కనుదోయిచెలువు వర్ణించు కవీ

శ్వరులకు మత్కులమే గద!
శరణము హరినీలరత్న సంతానముతోఁ.

గీ॥ గగనచరుఁ డౌట ఖేచరుం డగుదు నేను
గాయకుఁడ నౌట గంధర్వకాంతుఁడగుదు
కీటముల మార్చి జాలికాగ్రిముడనగుదు
చిత్రమిది నాదు ప్రజ్ఞావిశేష మహిమ.

ఆ॥ జాతిలోని కప్పురీతిని మాకంద
ఫలములందుఁ బుట్టి లలినిఁ బెఱిగి
జనుల కెల్ల నక్కజముఁగొల్పు ఘనశక్తి
కలదె! భ్రమరములకుఁగా కొరులకు.

క॥ నిలువు నను బూచి తరువులు
నలువుగఁ గందోయి విందొనర్చెడు నాయా
నెలవుల నెల్లను గులుకుచు
వెలయఁగ విహరింతుఁగోనవివశుఁడనగుచున్.

గీ॥ అబ్జమకరంద మాధుర్య మానియూని
కుముద కుసుమ మరందంబుఁ గ్రోలిక్రోలి
మావిపూవుల తేనెలు త్రావిత్రావి
యఖిల పుష్పరసంబుల నాస్వదింతు.

క॥ కేళీ వనములయందును
గేళీ వాపికలఁ దుంగగిరి శిఖరములన్
గేళీ సరోవరంబుల
బాళిన్ విహరింతుఁ బ్రసవపాళిన్ హాళిన్.

గీ॥ ఎవ్వరికిఁ గష్టమనిపింప కిల్లునిల్లుఁ
దిరిగి భిక్షాశనముఁదిను పేరవు మమ్ముఁ
జూచియే కాదె విద్యార్థులాచికొనుట
చాలదే! యీసుకీర్తి మాజాతికెల్ల.

గీ॥ చంపకము వంటి పుష్పరాజంబుఁగూడ
మాకటాక్షంబుఁ గోరి నీమమ్ముఁబూని
వర్షవాతాతపములోర్చి వనములోనఁ
జిరతపంబుంట మత్కీర్తి చిహ్నముకద!

* కోకిల.

గీతము.

నవవసంతోపవనంబను నాటకమున
ద్రష్టవగు కోకిలా! స్వాగతంబు నీకు.
శ్రీయెలర్పు వసంతుని రాయబారి
వైన పైకమ! నీకు శుభావహంబు.
ఆదరము తోడ నీకు సుఖాసనంబుఁ
జక్కఁజేయుచు నున్నాఁడు చైత్రుఁ డిపుడు
కౌతుకము తోడ స్వాగత గీతములను
బాడుచున్నవి శృంగారవనము లెల్ల.
అందమును జిందు మాకంద బృంద మెపుడు
కెంజిగురు గమి తోడ రాగిల్లుచుండు
నపుడె మేమెల్లరము నీయథార్థమైన
సుస్వరసుధారసముఁ గ్రోలి చొక్కఁగలము.
పుడమిపై నీకు దారిఁ జూపుటకుఁగాని
తిరుగు వత్సరమందు గుర్తింపఁగఁ గాని
నింగి నక్షత్ర మెదియైన నీకుఁ గలదో?

---

* లోగన్ కవి "కోకిల" ననుసరించి వ్రాయఁబడినది.

అతులితానందరస మగ్నమైన మనసు
గలిగిచెలఁగెడునట్టి ప్రేమికుఁడ వైన
పులుఁగ! నీపాటతోఁ బాటు పుష్పసమయ
మునకు స్వాగత మిడెదము ముదము బొదలఁ
బూవుఁ బొదరిండ్లలోపలఁ బులుఁగుగముల
మధుర గానంబు వినుచుఁ ధన్యుఁడ నగుదుం.
భువికి బోవుచు నుండెడు బాలకుండు
విరులఁ గోయంగఁ దోటలోఁ దిరుగుచుండి
నవ్యమైన వసంతగానమును గ్రోలి
కరము మదినిఁ జలించు నాకస్మికముగఁ
దనివి తీరక నీపాట ననుసరించు.
ఇతర దేశములందు నేఁటేఁట వచ్చి
యరుగు దెంచుచు నుండెడు నతిథి వగుచు
మఱియొక వసంతమునకుఁ బ్రేమంబుతోడ
స్వాగత మొసంగ సమ్మద స్వాంతమునను
నేఋతువు నందు నెల మూవు లింపు నింప
నేఁచి కడుఁ బూఁచి వాసించి యెలమి నించు
నాఋతువు నందుఁ గలనాద మలరలోయ
లందు నెగురుచు ముద మొందు చుందు వీవు.

ఎప్పుడెచ్చోటను వసంతుఁ డొప్పుచుండు
నప్పుడెల్లను నచట నీవలరుచుండి
పుష్ప వనుఁ గలంగార భూశ వాగనుఁ
జెలువలర నీవునుం బ్రకాశించుచుండు,
నిఖిల జనులకుఁ గడుఁగూర్చు నీడజంబ!
నిత్యమును బచ్చగా నుండు నీగృహంబు
నిర్మలంబుగ నుండు నీనింగి యెపుడు
రహిఁ జనించెడు నీ గాన రసము నందు
దుఃఖ రస మించు కేనియుఁ గాంచఁబోము.
రమ్యతరమైన నీవత్సరమ్మునందు
మమ్ము వడకించు శీతకాలమ్ము లేదు.
ఓహో! హాహా! పక్షిరాజమా! యురుతరగతి
నేను నెగురంగఁ గలుగుదు నేని నిన్నుఁ
గూడి యెగురుదు గద! కడు వేడ్క కలర.
తోషదాయకమగు ఱెక్కదోయి తోడ
మాధవుని స్నేహితుండనుగా మలయుచుండి
భూమి చక్రంబుచుట్టును బొల్పుగ మన
వార్షిక ప్రయాణమును జేసి హర్షినగుదు.

మలయజము.

గీ॥ సహజకాఠిన్యశైలంబు జన్మభూమి
కొలము స్నేహమెఱుంగని కొయ్యజాతి
పరమ మిత్రము లతిక్రూర పన్నగములు
శీలుఁడవు నీవు మలయజా! చిత్రముకద!

గీ॥ జనని గర్భంబు వెడలి నక్షణము మొదలు
సౌరభము నెల్లెడల వెదఁజల్లుచుంటి ;
పూవుపుట్టిన తోడనే తావి [illegible]వి
తెలియు నను పల్కు నిజమయ్యె మలయజంబ!

గీ॥ మలయగిరి నెన్ని పుట్టవు భూరుహములు
వాని పుట్టుకలకు నానవాలుఁ గలదె!
దశదిశలఁ దేజరిల్లె నీవిశదయశము
జన్మమన్నను నీదె శ్రీచందనంబ!

గీ॥ గంధవాహకుఁడును సదాగతియునైన
మారుతుండును గూడ నీమైత్రికతన
మంచిపేరును దాలిచి మలయుచుండె
సాధు సాంగత్యఫలమిదే చందనంబ!

ఆ॥ మలయజంబు మలయ మారుతమను పేర్లఁ
బరగు నిన్నుఁ బట్టి పవను బట్టి
మలయగిరి ధరిత్రి విలసిల్లెఁ గులదీప
కులుగదా ! సుపుత్రకులు మలయజ !

గీ॥ అనుటయేకాని యనిలున కబ్బినట్టి
నిత్యకీర్తికి మూలంబు నీవెకావె
శ్లాఘ్యుఁడవు నీవొకండవే సర్వగతుల
భూజనులకెల్ల శ్రీఖండ ! భూజరాజ !

క॥ నీవలెను మాతృభూమికిఁ
బావనకీర్తిని ఘటించి భాసిల్లినదే
యేవృక్ష రాజమైనను ;
భూవలయమునందిసు గంధ భూజ లలామా !

గీ॥ చలువఁ దనమున, బహుసువాసనలవలన
నఖిలజన మానసాహ్లాద మాచరించి
సరస గుణభాగ్య తనుజేసి చంద్రనాఖ్య
నలరుచుంటివి గాదెయో మలయజంబ !

గీ॥ నిన్ను ఖండించు వారికి నిప్పునందు
వైచి దహియించువారి కవ్వారిగాగ

సౌరభములిచ్చి తన్నొదవౌర ! నీదు
సద్గుణముశ్లాఘనీయంబు చందనంబ !

క॥ నరులకు నపకృతి చేసెడు
నరులకు నుపకృతియె చేయుఁడని తెల్పుటయో?
పరిమళ మిచ్చెద వరరే !
యరుగం దీసినకొలంది హరిచందన మా !

గీ॥ చందనము నీకుఁబుట్టిన మందిరంబు
సౌరతరు పంచకములోనఁ జేరి తీవు
బుధ జనా రాధ్య తను సదా బొల్తువీవు
గుణము త్యాగంబు కలదె నీ కొలఁది ద్రుమము?

క॥ ఘనతరులు నిన్నుఁ గనుఁగొని
ఘనతరగుణ మభ్యసింప గావలయును భూ
మిని బుట్టినందులకు నిటు
జననుతిఁ బడయంగ వలయుఁజందన ద్రుమమా!

సీ॥ పామరులుఁ భండితులు నృపగ్రామణులును
నిన్ను నక్కునఁజేర్చి మన్నించుచుండఁ
జెంచు లింధనములు గాగఁ జేతురకట !
“అతి పరిచయాదవజ్ఞత” యనరె ! బుధులు

గీ॥ మూలము భుజంగములఁ కగ్రమును విహంగ
ములకు నీడను సారంగ ముఖ్యములకు,
నంగమెల్లను నరలోక పుంగవులకు
దాన మిడుమేటిదాత ! గంధద్రుమంబ !

అగస్త్యభ్రాత.

గీతము.

భరత వర్షంబు నుద్ధరింపఁగ జనించి
మించు ఋషికుల మందున మేటియగుచు
నవతరించెను సార్థకాహ్వయము గాఁగ
నుత్తముండను నొక యుత్తమోత్తముండు.
వేద వేదాంగ సార సంవేదియతఁడు
వివిధ శాస్త్ర రహస్య కోవిదుఁడతండు
పృథు తపోయోగ నిష్ఠా గరిష్ఠుఁ డతఁడు
ధృతి జితేంద్రియలోక వరిష్ఠుఁ డతఁడు.
వింధ్యగర్వంబు సర్వంబు వంధ్యపఱచి
చెనఁటి యిల్వల వాతాపులను వధించి

కడలి జలముల నెల్లను బుడిసిలించి
ఖ్యాతిఁ గన్న యగస్త్యుని భ్రాత యతఁడు.
అత్తఱిసి యొద్ద లేని మహత్తు లేదు
ఆతని కసాధ్యమైన కార్యంబు లేదు
అతఁడెఱుంగని దాఁక రహస్యంబు లేదు,
అతఁడు చేసిన మేలు సుంతైన లేదు.
శృంగభంగంబు ఖలులకుఁ జేయ లేదు.
దుష్టరాక్షస వర్గంబు దునుమ లేదు.
జడమతుల పొంగుపాళ్ళ నడఁప లేదు.
శాస్త్రరచనను నుపకృతి సలుప లేదు.
జగతికే యుపకారంబుఁ జలుపకునికి
స్వీయ శక్తిఁ బ్రకాశింపఁ జేయకునికి
లోకవిషయంబు పొంతలఁ బోకయునికి
నుత్తమ మునీంద్రు డెఱుఁగరీ యుర్విజనులు.
అందు మూలంబునను నతం డెందుఁ జనిన
నాతఁడెవరని యెవ్వరైన నడిగి రేని
వాని పేరు ప్రసిద్ధంబు కాని కతన
ప్రజలు పేర్కొనిరి యగస్త్యభ్రాతయనుచు.
అఖిలమునకు నగస్త్యుని యంతవాఁడు

నిఖిల మునులకు వంద్యుఁడై నెగడు వాఁడు
దశదిశల సద్యశము నింపఁదగిన వాఁడు
ఊరుఁ బేరును లేకుండ నొఱిగి నాఁడు.

ఎంతఘనుఁడైన దనవల్ల నింతయైన
లోకమున కుపకారంబు లేకయున్న
జనుఁ డనామకుఁ డగుట నిస్సంశయంబు
ఉత్తముఁ డనామ తరువయి యున్నయట్లు—

ఆంధ్రదేశీయులార! గుణాఢ్యులార!
ఘనులు మీలో ననేకులు గలరు గాని
రూఢిగ నగస్త్యులవ్వెదరో? యగస్త్య
భ్రాతలగుదురా? యద్ది మీచేతఁ గలదు.

దోమ.

గీ॥ సారె నాయంత వారలు లేరటంచు
నగని పడియెద వెందుకే? నీచజన్మ!
ఏనుఁగాదువె! నీవు పాల్లెన్ని పడిన
తొండ మున్నంత మాత్రాన దోమకూన!

కం॥ జవ సత్వము లున్నవె యా
హావములలో ఘనశతఘ్నికాదుల నెల్లన్
దవిలి వహింతువె! కరితో
నవమతి! నీకెట్టి సామ్య మరయవె! దోమా!

క॥ భటులకు వాహంబై యా
ర్భటితో ఘీంకృతులు సెలఁగఁ బ్రతివీరమహా
పటలములఁ ద్రుంపఁ గలవే
పటుగతిఁ గరహాతుల బహుళపద ఘట్టనలన్.

గీ॥ నెలతలకు మందయానంబు నేర్పఁగలవె?
దాన ధారల నలులను దనుపఁ గలవె?
పొసఁగు మౌక్తిక దంతంబు లొసఁగఁ గలవా?
సామజమునకు నీకేటి సాటి? చెప్పుమ!

గీ॥ డేగతో నీడువచ్చునే ! యీగ కూన
బెబ్బులికి సాటి వచ్చునే ! పిల్లి కూన
హస్తి మశకాంతరం బనుమైన వినవె !
యుద్ధియే నీకు గజమున కోసి దోమ !

క॥ ఆరాజ్య పూజ్యతయు నా
గౌరవ మాభోగ మూ యఖండానందం
బీడేదు తనువు లెత్తిన
నేరీతినినైనఁ గాంతువే! మశకంబా !

క॥ లోకుల కేలాభంబును
లేకున్నను గీడు కలడులే నీకతనన్
నీకాటువలన జ్వరములు
చేకురు నీజన్మమేమి ? సీ ! సీ ! దోమా !

క॥ పాడిమిగా సంగీతముఁ
బాడెదు గతి చెప్పలచెంతఁ బాటస్వరములన్
బాడెదవు నిద్రఁ జెఱుపుచుఁ
గూడునె ! యీలాటి నీచగుణములు దోమా

క॥ చిరుమేని దానవైనను
నరులకు నీకతన యాతన ఘనంబెసుమీ !

పరికింప గొప్ప గృహముల
నెరుసే దహియింపదే తుణికమున దోమా!

క॥ రవ్వంత గాలి వీచిన
మవ్వముచెడి నిలువలే కమాంతముగఁ గదరా
దవ్వునఁ బడెదవు నీకీ
క్రొవ్వేటికె? నరులఁబట్టి కుట్టెదు దోమా!

క॥ నల్లివలె నలుపఁ బోవఁగ
నల్లన నెగసెదవు కుట్టినంతనె నిన్నున్
బల్లిదినను! నీ యిల్లా
కొల్లలై పోను! మేమి గుణమిది? దోమా!

క॥ రక్తంబుఁ ద్రావి బ్రతుకుట
నక్తం చరకోటికెల్ల నైజము నీకున్
యుక్తము గాదిది మానుము
వ్యక్తి గలిగి సంచరించుమా! మశకమ్మా!

క॥ పొగరెక్కి సర్వులఁ దెలియక
పగఁగొని హింసింపఁ బోవు పలుమరునిన్నున్
పొగఁబెట్టి చంపనేర్తురు
తగ దింతటి దుడుకుఁదనము తక్కరి దోమా!

క॥ దూతలు చలిపులటంచును
జేతులఁ దట్టుచును విసువుచేతను నిన్నుఁ గా
బూతులు దిట్టుచు రోతురు
రాతురులను మనుజులెల్ల రక్కసి దోమా!

క॥ ధనికులు దోమతెరల వ
ల్లను బీదలు గడ్డి తొంటల కతంబున నీ
పెను బాధఁ బాపి కొనుచుం
దినముల నొకరీతిఁ బుచ్చి తేలిరె దోమా!

క॥ జలదారులు పశువుల సా
లలు నతి దుర్గంధయుత జల స్థలములు నీ
కులమునకు జన్మభూములు
వెలయుఁగ నపవిత్రురాలవే ఛీ! దోమా!

క॥ హింస మహాపాపం బని
హింసింపరు శత్రుకోటి నేనియుఁ దజ్ఞుల్
హింసించెద విటు సాధుల
ధ్వంసంబగుఁ జుమ్మి ఖలులవంశము దోమా!

క॥ సాధు లుసురుమని తిట్టినఁ
బోదూరక యగ్నివోలెఁ బొలియించు మహా

క్షేమంబు సంభవించును
రాదు సుఖము తెలిసి బ్రదుకరాదే! దోమా!

క॥ కొల్లేరు నీరుఁ బుట్టిన
యిల్లచ్చటి కేగు మెన్నఁడిటు రాకుము! నీ
పొల్లచటఁ బోసి కొమ్మా!
యల్లరి నీకేల? బ్రదుకుమా! నెమ్మదిగన్.

* స్వాతంత్ర్యము.

మంజరీ ద్విపద.

ధైర్యశాలురును స్వాతంత్ర్య తత్పరులు
సాహసికులునైన సజ్జనోత్తముల
వంశంబుల జనించి వర లెడు వార
మని దంభమడరంగ నతి గర్వమునను
మత్తులై చరియించు మానవులార!
ఎందైన బానిసీఁడే యుండెనేని
సాహసులే? మీరు స్వచ్ఛంద పరులె?
వాస్తవంబుగ మాకు వచియింపరయ్య!
మీకు సోదరులుగా మెలఁగెడు నట్టి

* "లవెల్" అనువాని స్వతంత్రత కనువాదము.

వారి శృంఖలములు వదలింపరేని
వారి కష్టములకై వల పోయరేని
నిజముగా మీరు బానిసవాండ్రు గారె ?
అమల స్వతంత్ర తార్వాతఁ గాంచలేని
పరమ వినీచులౌ బానిసల్గారె ?
స్వార్థంబు పొంటను బంధనంబులను
సడలించు కొనుటయుఁ జర్మ ఛత్రికల
వంటి కాదమూత్రోడఁ బ్రజలకు నెల్లఁ
బటుతరంబగు నప్పు పడియుంటి మనుచుఁ
దలపకుండుటయు స్వాతంత్ర్యమే యగునె ?
కాదు ! ము మ్మాటికిఁ గాదది కాదు !
మన సోదరుల నెల్ల మఱుగంగఁ జేయు
నిడుములు మనము భాగించుకొంటయును
జేతనైన కొలందిఁ జేతులతోను
గృపజిల్కు నిర్మల హృదయంబుతోను
బరుల స్వాతంత్ర్య లాభప్రాప్తిఁ గోరి
యుత్సాహమును జూపుచుంటయే స్వేచ్ఛ !
అదియె స్వచ్ఛంబుగా నలరారు స్వేచ్ఛ !
అదె మానధనులు నిత్యముఁగోరు స్వేచ్ఛ !

ఎవ రధోగతినున్న హీన మానవుల
పక్షంబు, దుర్బల ప్రజల పక్షంబు
నవలంబించి వాదింప భయముఁ జెందుచుందురో
యా మానవులె నీచులగు బానిసీలు !
ఎవరు స్వధర్మమై యొసఁగెడు నట్టి
సత్యమార్గము నుండి జడత్వ మొందఁ
దొలఁగుట కంటె మర్త్యుల యసహ్యతయు
నాక్షేపణములును నపనిందనములు
నధికంబుగా నెంచి యభిలాష పడరో !
ఆ నరులే హీనులగు బానిసీలు !
ఎవరు ముగ్వురిఁ గాని యిర్వురిం గాని
కలసి న్యాయములైన కార్యంబులందు
వర్తింప వెఱతురో వారె బానిసలు !

మంగిపూడి వేంకటశర్మగారి గ్రంథములు.

నాటకములు.

వీరమతి

ఇది చరిత్రాత్మకమై వీరరసభరితమై కరుణారస పూరితమైన యేడంకముల చక్కనినాటకము. ఇందు రాజపుత్ర స్త్రీరత్నములకు సహజములగు దేశభక్తి, స్త్రీసాహసము, స్వార్థత్యాగము నత్యద్భుతముగా ప్రదర్శింపఁబడినవి. భారతీయు లెల్లరును పఠింపఁదగినది. వెల రూ. 0-10-0

పుష్పవేణి

ఇది కరుణరసప్రధానమై యద్భుతకథావిలసితమై నవరసభరితమైన యైదంకముల మంచినాటకము. ఇందు భారతీయ నారీతిలకములకు సహజమైన పాతివ్రత్య మత్యాశ్చర్యకరముగా ప్రదర్శింపఁబడినది.

ఇందు కన్యాశుల్క, వరశుల్క, బాల్యవివాహ, వృద్ధవివాహ, విషమవివాహాది సంఘసంస్కరణ విషయములు సరసముగా వర్ణింపఁబడినవి. వేయేల? ఈనాటకము నీతులకు నిధానము. ఇందలి దొంగల పాటలును, పద్యములును, సంభాషణములును కడుపుచెక్కలగునట్లు నవ్వుపుట్టించును. ఎల్లవారును చదివి తీరవలయును. రూ. 0 - 0 - 0

పద్యములు.

బాలవితంతువిలాపము.

జాలిపుట్టించు పద్యములు. ఒక్క పద్యము విన్నఁ జాలును. వజ్రమువంటి హృదయమైనను వెన్నవలె కరిగిపోవును. శైలిసులభమై మనోహరమై ద్రాక్షామధురమై యొంతచదివిన తనివితీరదు.

రూ. 0 - 4 - 0

స్త్రీ ధర్మబోధిని.

భరతమాతృశతకము.

భక్తిరసభరితము. దేశభక్తులందఱును జదివి ప్రతిబాలుని చేతను, ప్రతిబాలిక చేతను జదివింపవలసి నది. ఇంటింట నుండఁదగినది. వెల. రూ. 0 - 1 - 6

వచనములు.

రాజలేఖ.

స్త్రీలకు సంగీతము లేని లోపములను దెలుపు నీతి బోధకమగు నిజమైనకథ. ఇందు వేశ్యలనుగూర్చిన హృద్యములగు పద్యములును గలవు. పెద్దయక్షరములతో రెండవమారు ముద్దుగా ముద్రింపఁ బడినది. వెల. రూ. 0 - 3 - 0

లలిత.

ఇదియును నిజమైన నీతికథయే. అసమాన వివాహమువలన సంభవించిన యనర్థమిందు చక్కఁగా

వర్ణింపఁ బడినది. శైలి లలితమై పేరుకుతగినట్లు న్నది. పెద్దయక్షరములతో నందముగా నచ్చొత్తింపఁబడినది. వెల. రూ. 0 - 3 - 0

ద్రౌపది.

సుప్రసిద్ధురాలగు నీమహాపతివ్రత చరిత్రము విపులముగా తేటమాటలతో వ్రాయఁబడినది.

వెల. రూ. 0 - 3 - 0

సీత.

త్రిజగత్పూజ్యురాలగు నీ సతీరత్నము పవిత్ర చరిత్ర మతిరసవంతముగా సులభశైలిని రచియింపఁ బడినది. వెల. రూ. 0 - 3 - 0

చిరునామా:—

మంగిపూడి వేంకటశర్మగారు

పిప్పర,

పెంటపాడు పోస్టు

కృష్ణజిల్లా,